# వాలిన వర్షమేఘం

చక్రవర్తి రంగస్వామి

పద్మావతి రైల్లో కూచుంది.

శ్యామూ, సూర్యం ప్లాట్‌ఫారమ్ మీద నిల్చొని వున్నారు.

పద్మావతి వాళ్లవేపే వాత్సల్య పూర్ణనయనాలతో చూస్తూ వుండిపోయింది.

ఆమె కళ్లలో నీళ్లు నిండాయి.

"అమ్మా, ఏడుస్తున్నావా?" శ్యాము అడిగాడు.

"ఛీ ఛీ, ఏమిటమ్మా అదీ!" సూర్యం అన్నాడు.

"ఏమీ లేదు బాబూ, ఏమిటో పిచ్చిమనస్సు" అంటూ కళ్లు తుడుచుకుంది.

"అయితే పెట్టే, పక్కచుట్టా తీసుకో సూర్యం, అమ్మను మళ్లీ యింటికి తీసుకెళ్దాం" అన్నాడు శ్యాము నవ్వుముఖంతో.

సూర్యం పెద్దగా నవ్వాడు.

పద్మావతి ముఖంలో కూడ అంత విచారంలోనూ చిరునవ్వు కనిపించింది.

రైలు కూసింది.

ఈసారి శ్యామూ, సూర్యం — యిద్దరి. కళ్లలోను నీళ్లు తిరగటం పద్మ చూసింది.

"నాన్నగారిని జాగ్రత్తగా చూసుకోండి.." అంటూ ఆమె పమిటచెంగుతో కళ్లను గట్టిగా అద్దుకుంది.

రైలు కదిలింది.

"నువ్వు మళ్లీ త్వరగా రావాలమ్మా! డాక్టరుగారి అమ్మనుగదా అని మమ్మల్ని మరిచిపోయేవ్" అన్నాడు శ్యాము.

కళ్ల మీదినుంచి పమిటను తొలగిస్తూ 'నేను రావటం మాట అటుంచి....''

ఆమెకు దుఃఖం మళ్లీ పొర్లుకొచ్చింది. ఈసారి ముఖాన్నంతా పమిటతో కప్పుకుంది.

రైలు వేగం తీసుకుంది. రైలుతో సమంగా పరుగెత్తుతూ శ్యామూ, సూర్యం గాలికి చెదురుతూన్న గొంతుకలతో "అమ్మా, అమ్మా" అని పిలుస్తున్నట్లు వినిపించసాగింది. ఆమె యిందాకటి వాక్యాన్ని వెక్కి వెక్కి ఏడుస్తూ పూర్తిచేసింది. ధైర్యంగా వుండండి బాబూ."

ఆమె లోపలి తుఫాను బయటికి వెళ్లపొంగింది. చాలసేపు ఏడ్చింది. చివరకు "అబ్బా" అని అనుకొని సజలనయనాలతో ఆకాశంవేపు చూస్తూ కూచుంది.

దీర్ఘ జీవయాత్ర చేయుగలిగినవాళ్లు ఎన్నో పరిణామాలను చూడగలిగినట్లు రైలు అనేక స్టేషన్లను ఆగి చూసి వెళ్లుతోంది.

దిగవలసిన స్టేషన్ వచ్చి పద్మావతి దిగింది.

మోహన్ స్టేషన్ దగ్గరకు మోటారు తీసుక వచ్చాడు.

కొడుకు ముఖంలోకి ఆప్యాయంగా చూస్తూ "వచ్చావా, నాయనా! వచ్చావో లేదోనని చూస్తున్నాను" అంది.

"ఎందుకు రాను?" స్వరంలో కోపం ధ్వనించింది.

"ఏమో! అనేక పనులుండవచ్చు కదా" అని అంటూ కొడుకు వెంట నడిచి వెళ్లి వెనుకసీటులో కూచుంది.

మోహన్ డ్రైవరు సీటులో కూచున్నాడు.

కారు చాలావేగంగా వెళ్లుతోంది. రోడ్డుకు అటూయిటూ నీరులేక ఎండిపోతున్న చేలు, దూరంగా ఎండలో మెరుస్తున్న నల్లని కొండగుట్టలు, ఎండిపోయిన చెరువులు, నెర్రెలు విచ్చి హృదయవిదారకంగా కనిపిస్తున్నాయి. ఎండకు వాడిపోయిన ముఖాలతో అక్కడక్కడ నిల్చొని పశువులు మోటారువేపు మోరలెత్తి చూడసాగాయి.

మోటారు వూళ్లోకి మలుపు తిరిగింది. పడిపోతున్న మట్టిగోడల యిండ్ల వరుసల మధ్య నుంచి నెమ్మదిగా పోతోంది. హృదయంలోని ఆర్ద్రతను పోగొట్టుకున్నట్లు గ్రామదేవత వికృతంగా కనిపించింది పద్మావతికి. వడలిపోయిన ముఖాలతో, అయిదారుగురు గ్రామస్థులు దారిన పోతూ బెదరిబెదరి మోటారువేపు చూస్తూ వెళ్లారు.

పోయిపోయి మోటారు ఒకపెద్ద యింటి ముందు ఆగింది. తల్లిని మోహన్ యింట్లోకి తీసుకవెళ్లాడు. ఆమె అపూర్వకాలపు యింట్లోకి వెళ్లుతూన్నప్పుడు జీవితంలో మరో కొత్తదశలోకి అడుగుపెడుతూన్నట్లు అనుభూతి పొందింది.

తల్లిదండ్రుల చాటున గడచిపోయిన బాల్యం తరువాత దాంపత్య జీవన ప్రాంగణంలో అడుగు పెట్టినప్పుడు అంతా అద్భుతం అనిపించింది. స్వామి సుధాపాత్రను ఆమె పెదవుల కందించి జీవన మాధుర్యాన్ని చవిచూపాడు. ఆశ్చర్యానందాలతో జీవితం యింత మధురాతి మధురమా అనుకుంటూ పరవశంలో ఆమె భర్తకు అల్లుకపోయింది.

మరుత్త యింకా వదలనే లేదు. చూడలేని దుర్విధి వికటాట్టహాసం చేసింది. భూమి బ్రద్దలై, మిన్ను విరిగినట్లయింది. తాను చుట్టుకొని వున్న తియ్య మామిడిచెట్టు మొదలంటా కూలిపోయింది. సర్వ సుఖభోగాలు ఆమె నుండి దూరదూరాలకు పారిపోయి అదృశ్యమయ్యాయి. ఆమె దుఃఖదేవత ఒడిలో కుమిలిపోసాగింది.

ఆమె ఎడతెగని కన్నీటిని తుడుచుకొని చూసింది. పొత్తిళ్లలో పసికందు మోహన్, హృదయం ద్రవించేలా చిన్నిచేతులు చాచి దీనంగా చూశాడు. హృదయానికి హత్తుకొని, బ్రతకాలనుకుంది. నిత్యమూ పరుముకుంటూ వచ్చే దుఃఖానికి లొంగిపోకుండా మోహన్ కోసం రోజువెంట రోజును గడుపుకుంటూ బ్రతుకును వెళ్లబుచ్చాలనుకుంది.

తల్లిదండ్రులు, అన్నదమ్ములు ఎవరూ లేని పద్మావతికున్న ఒకే ఒక చెల్లెలు కళ్యాణి అక్కను చూసి ఓదార్చడానికి వచ్చింది. కళ్యాణి భర్త కరుణాకరరావు సుప్రసిద్ధమైన విద్యావంశానికి చెందినవాడు. చదువు, సంస్కారము, పెద్దయిల్లు, కొద్దిపాటి భూమి అతనికి మిగిల్చి పోయారు పెద్దలు. వ్యవసాయం చేయించుకొంటూ కలిగిన దానితో తృప్తిగా జీవించే తత్వం అతనిది.

కళ్యాణికి ఒకకొడుకు. ఇప్పుడు గర్భవతి. రాగానే అక్కను కౌగిలించుకొని ఏడ్చింది. సుఖస్వప్నంలాంటి జీవితం ఎంతలో ఎలా దుఃఖ సముద్రములోకి పడిపోయిందో చూసి ఆమె హృదయం విలవిలలాడిపోయింది. "ఎవరి జీవితమైనా యింతేకదా" అని దిగులుగా అక్కవేపు చూస్తూ వుండిపోయింది. అపారమైన కరుణ రసంతో నిండిపోయింది హృదయం. సోదరీప్రేమ కట్టలు

తెంచుకుంది. ప్రపంచంలో ఎవరూ లేనట్లు అక్క ఒంటరిగా వుండటం ఆమె సహించ లేకపోయింది. బ్రతిమిలాడి ఒప్పించి తన యింటికి తీసుకు పోయింది.

పద్మావతికి ఇప్పుడు తీరికలేదు. తన మోహన్ తోపాటు చెల్లెలికొడుకు శ్యాము కూడా ఆమెను 'అమ్మా'' అని పిలవటం మొదలు పెట్టాడు. పిల్లలు తమ తియ్యటి మాటలతోటి, ఆట పాటలతోటీ అవిశ్రాంతిగా రంజింపజేస్తున్నారు. వాళ్ళస్నానాలు, అన్నపానాలు ఆమే చేస్తోంది. వాళ్ళు ఏది చేస్తున్నా ఆమెనే చూడమంటూ, ఎప్పుడూ ఆమెనే చుట్టుకొని తిరుగుతూ, మనస్సుమీదికి విషాదచ్ఛాయలను రానివ్వకుండా కాపాడుతున్నారు. అంతే చాలుననుకొని వాళ్ళతో పాటు అదే లోకంగా గడుపుతోంది. కాలం జరిగి పోతోంది.

భర్త వియోగదుఃఖంతో, యీ పసికందుని ఎలా బ్రతికించుకో గలనా అన్నదిగులుతో ఎప్పుడూ కుమిలిపోతూ జీవితం మీద విరక్తిని పెంచుకొన్న అక్కను తన ఆశ్రయంలోకి తీసుకు రాగలిగి నందుకు కళ్యాణికి ఎంతో తృప్తి కలిగింది.

తన కొడుకూ రాత్రింబవళ్ళు మోహన్‌తో పాటు అక్కడగ్గరే వుండి పోతున్నాడు. ప్రేమగా దూరం నుండే చూసి చిరునవ్వు నవ్వుకునేది.

క్రమంగా నెలలు నిండి ప్రసవించే రోజులు వచ్చాయి.

ఒక సాయంత్రం కళ్యాణికి నొప్పులు ప్రారంభ మయ్యాయి. నొప్పులు వచ్చి చాలాసేపు వుంటు న్నాయి. నొప్పులకు తట్టుకోలేక నీరసపడిపోతోంది. మంత్రసాని ఏమీ చేయలేకపో తోంది. ఇలాగే రెండు రోజులు గడిచాయి. పదిమైళ్ళదూరంలో వున్న డాక్టరును పిలుచుక వచ్చాడు కరుణాకర రావు. డాక్టరు ఇంజక్షన్లు యిస్తూ దగ్గర కని పెట్టుకొనే వుంది. కళ్యాణి నీరసపడిపోతోంది. నొప్పులు దగ్గరదగ్గరగారావడంమొదలు పెట్టాయి ''చాలా బలహీనపు తత్వం, పైగా చాలా కష్టపు కాన్పు''అంది డాక్టర్. కళ్యాణికి శరీరమంతా ఎడ తెగకుండా దిగచెమటలు పోయ సాగాయి. తరచు స్మృతి తప్పిపోసాగింది. డాక్టరు రాత్రంతా కళ్యాణి పక్కదగ్గరే వుండి వైద్యం చేస్తోంది. ఎంత శ్రమ పడికూడా కళ్యాణిని రక్షించలేకపోయింది. మాతృగర్భంనుంచి శిశు వును మాత్రం తీసి రక్షించ గలిగింది—ఎలాగో.

ఎవరూ గమనించని స్థితిలో తలవంచుకొని వెళ్లిపోయింది డాక్టరు.

కళ్యాణి చనిపోయిందని తెలిసి వూరు వూరంతా కరుణాకరరావుగారింటికి వచ్చింది. అక్కడ చేరిన అందరికళ్ళవెంటకన్నీరు ప్రవహిస్తోంది. సర్వమూ విషాదంతో స్థంభించిపోయింది.

పద్మావతి ''భగవాన్! చెల్లెలిని వుంచినన్నెందుకు తీసుకపోలేదని'' పెద్దగా ఏడుస్తోంది. ఆమె నొడుము చుట్టుకొని పిల్లలు గోలగా ఏడవసాగారు.

కరుణాకరరావు పెత్తన పిడుగుపడ్డవాడిలా నిలువునా కూలిపోయినట్లు కనిపించాడు. ''నీవు లేని ప్రపంచంలో నేను వుండలేను...' అని కళ్యాణివేపు కన్నీళ్ళతో చూస్తూ ఆక్రందిం చాడు. నిరుత్తర అయిన కళ్యాణి మీరు వుం డక తప్పదు. అన్నట్లనిపించింది. ''అయితే, పిచ్చివాణ్ణికాకుండా ఎలా బ్రతికి వుండగలను చెప్పు కళ్యాణి!''అని బొంగురైన గొంతుకతో, కట్టలు తెగిన దుఃఖాన్ని ఆపుకోటానికి ప్రయత్నం చెయ్య కుండా పసిపిల్ల వాడిలా ఏడ్చాడు.

అంతా యథావిధిగా జరిగిపోయింది. పసుపు, కుంకుమ, పూలు, అలంకరణలు, మంగళవాయి ద్యాలతో తరలివెళ్ళి పోయింది కళ్యాణి. వూరు వూరూ కన్నీటితో వీడ్కోలిచ్చింది.

అందరి నోటా ఒకేమాట పలికింది. ''భగ వంతుడు ఎందుకు యింత నిర్దయగా ప్రవర్తి స్తాడు!''

కళ్యాణి చితినుంచి లేచినజ్వాల కఠినమైన జవా బులా తోచింది అందరికీ. చలనరహితంగా స్థం భించిపోయిన వాతావరణంలో, బరువైన హృద యంలో , ఏడ్చి ఏడ్చి వుబ్బిన కళ్ళతో, కరుణ రసం మేల్కొల్పిన మానవత్వంలో ఎవరి యిళ్లకు వాళ్లు వెళ్లిపోయారు.

మర్నాడు కరుణాకరరావు గదిలో కుర్చీలో కూచుని, ఏమిచెయ్యటానికీ దిక్కుతోచక, కిటికీ లోంచి బయటి శూన్యంలోకి అర్థనయనాలతో చూస్తూ కూర్చున్నాడు. గదిలోంచి నిన్నపుట్టిన పసికందు ఏడ్పు వినిపిస్తోంది. పద్మావతి బొంగురైన గొంతుక గద్గదికంగా లాలిపోస్తోంది. చప్పున లేచి బీరువాలోంచి భగవద్గీత తీసుకొని చూడటం ప్రారంభించాడు.

అతని జీవితంలో గొప్పమార్పు తెచ్చిన క్షణం అది. అప్పటినుంచి గదంతా వేదాంత గ్రంథాలతో నిండిపోయింది. వేదాంత శాస్త్రాధ్యయనంలో కొన్ని ఏండ్లు గడచిపోయాయి. ఎప్పుడూ అంత ర్ముఖుడై తన గదిలోనే వుండేవాడు. వంటమనిషి సుబ్బయ్య పిలిచినప్పుడు మాత్రం స్నానానికి, భోజ నానికీ వెళ్లేవాడు.

సాయంత్రం పూట గుమస్తా రాజయ్య బలవంత పెట్టి అలా పొలాల వేపు తీసుక వెళ్లేవాడు.

ఏండ్లు గడిచినకొద్దీ పిల్లలు పెద్దవాళ్ళయి చదువుకుంటున్నారు.

క్రమంగా కరుణాకరరావు విచారాన్ని బయ టికి కనపడనివ్వకుండా లోలోపలే నిక్షిప్తం చేసుకో గలిగాడు అలా చేసుకోగలగటానికిముందు కొన్ని ఏండ్లు ఆధ్యాత్మిక సాధనచేశాడు. ఉత్తర, దక్షిణ దేశ యాత్రలన్నీ చేసి, మహాత్ములతోటి నెలల తరబడి వేదాంత చర్చ చేశాడు జీవితాన్ని భగవన్మయము చేసుకో తలచిన సాధకుడై హృద యాన్ని విశుద్ధంగా వుంచుకో కలిగాడు.

మాలిన్య రహితమూ, పవిత్రమూ అయిన ఆంతరిక జీవితానికి, సరళమూ సాత్వికమూ అయిన బహిర జీవితాన్ని మేళవించుకొన్నాడు.

తన విశాలమైన ఇంట్లో పద్మ ఏ మూల వుందో అతనికి అక్కరలేదు. సుఖంగా వుంటే చాలు. మోహన్, శ్యాము, సూర్యం అందరూ సమానమే.

అందరూ సుఖంగా వున్నారా, సక్రమంగా అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయా అన్న విష యం తెలుసుకోవడం తన దినచర్యలోని ఒక అంశం అయినకు.

• • •

మోహన్ మెడికల్ కాలేజీలో చదువుకుంటు న్నాడు. మధు అనే విద్యార్థి అతనికి స్నేహితుడు.

మధు ఒకసారి సెలవుల్లో మోహన్‌ను తన వూరికి తీసుకు వెళ్లాడు. అది పల్లెటూరు. అవి పొలం పనుల రోజుల కావు. గ్రామస్థులు తీరి కగా కాలం గడిపేస్తున్నారు. సరస సల్లాపాలు, వెక్కిరించుకోవటం, గిల్లి కజ్జాలు పెట్టుకోటం, యితరుల గురించి అనవసరప్రసంగాలుచెయ్యటం, కక్షలు సాధించుకోటం ముమ్మరంగా జరుగు తున్నాయి. వాటికి సత్యంతోటీ, న్యాయంతోటీ, సభ్యతతోటి సంబంధమేమీ వుండదు. ఆ ప్రసం గాలవల్ల ఎదటి జీవితాలు ఏమైనా కానీ, అవి నల్లేరు మీద బండిలా సాగిపోవలసిందే.

మోహన్‌తో కలిసి పోతున్న మధుని పిలిచి అరుగుమీద కూర్చున్న అయిదుగురు వ్యక్తులు ప్రసంగం మొదలుపెట్టారు చుట్టలు కాలుస్తూ.

చదువు ఎప్పుడు పూర్తి అవుతుందన్నది మొదటి ప్రశ్న.

ఎక్కడ ఉద్యోగం చేస్తావన్నది రెండోప్రశ్న.

''ఈ అబ్బాయిది ఏవూరు ? ఎవరి కుమారు'' డన్నది మూడోప్రశ్న. ఈప్రశ్న ఆధారంగా తరు వాత ఎంతో ప్రసంగాన్ని వాళ్లు నడపగల్గారు.

మోహన్ తండ్రికి దూరపు చుట్టంటఅయి దుగిరిలో ఒకతను.

వయసులో వుండగా భర్త చనిపోయిన స్త్రీ —మరిది యింట్లో — అంటే పరాయి పురుషు డింట్లో వుండటం సబబు కాదన్నాడు. అందులోనూ చెల్లెలు చనిపోయాక కూడ మరిది యింట్లోనే వుండటం లోకం మెచ్చే పని కాద న్నాడు. ఇంకా చెబుతూనే వున్నాడు. మిగిలిన నలుగురూ తలలూపుతూనే వున్నారు.

మోహన్ ముఖం వివర్ణమైపోయింది. నిల్చోటం కష్టమనిపించింది.


అది మధు కనిపెట్టి ''యిక వెళ్ళొస్తాం'' అంటూ ముందుకు సాగాడు

తన ప్రసంగాన్ని ఆపివెయ్య వలసి వస్తున్నం దుకు ఆ పెద్దమనిషి ఎంతో అసంతృప్తుడై చివరి మాటలుగా యిలా అన్నాడు —

''లోకం పోకడ చెప్పాను బాబూ! మేమేదో యింకా నీతీ, జాతీ, కట్టుబాట్లను పట్టుకొని వేలాడుతున్నాం . . .''

మోహన్ తల తిరిగి పోయింది.

పీద చేయివేసి నెట్టుకపోతూ ''శుద్ధ పశు వులు. నీతి అంటే ఏమిటో మహాతెలిసి ఏడిసి నట్టు వెధవ వాగుడూ — పీశ్నానూ! ఒట్టి పనికిరాని మనుషులు'' అని మోహన్ ముఖంలోకి చూశాడు మధు.



వివర్ణమైన ముఖంలోకి మ్లానమైన చిరు నవ్వును తెచ్చిపెట్టుకున్నాడు మోహన్.

మధు ప్రసంగం మార్చి, మొగలి పొదరి పక్కగా, ఇసుక దిబ్బల మీదుగా వున్న దారి వెంట చల్లని అందమైన ఆకుతోటల్లోకి తీసుకు వెళ్లాడు.

సెలవులైపోయాయి. మళ్లీ మెడికల్ కాలేజీ జీవితం సాగుతోంది.

మోహన్ మనస్సుమీద పడ్డ మచ్చ, తీవ్రమైన చర్మవ్యాధిలా, మనస్సు నంతనూ క్షణంలో అల్లుకొని — ఆత్మ అంతటితోనూ ప్రేమిస్తున్న తల్లిమీద అసహ్యాన్నీ, భయభక్తులూ, గౌరవమూ వున్న కరుణాకరణవుగారి మీద ద్వేష భావన్నీ, పుట్టించింది.

ఈ మానసికమైన బాధలు వెళ్లకక్కటంగాని, దిగమింగటం కాని అతను చెయ్యలేని పనుల య్యాయి. అందువల్లే ఇంటికి వెళ్లినప్పుడల్లా తల్లిని అసహ్యించుకుంటున్నట్లు చూడసాగాడు. ''అమ్మా'' అని పిలవటం మానేశాడు.

ఇది ఇతరులెవ్వరికీ తెలియదు.

మోహన్‌లని ఈ మార్పుకు పద్మావతి కంపించి పోయింది. ఆమెలో తీవ్రమైన బాధ ప్రారంభమైంది. ఆ బాధను భరించటం ఒక్కొక్కసారి అసాధ్యమవుతోంది.

ఇంతలో మోహన్ చదువు పూర్తి అయ్యి, ఒక తాలూకా ఆసుపత్రిలో డాక్టరుగా చేరాడు.

ఇప్పుడు కొడుకు ఒక్కడే వుంటున్నాడు కాబట్టి తాను అక్కడికి వెళ్లి ఆతని హృదయంలో వున్న సంకోచం ఏమిటో తెలుసుకొని తొలగించాలని ఆమె తొందర పడసాగింది.

ఒకరోజు కొడుకు దగ్గరకు ప్రయాణం కట్టింది.

''నువ్వు అక్కడకు వెళ్లటం ఎందుకు పద్మా! మోహన్ ఒక్కడే అయితే ఏహోటలు నుంచో భోజనం తెప్పించుకొని భోంచేస్తూ, పని చూసుకుంటూ వుంటాడు. నువ్వు వెళ్లినప్పటినుంచీ వంటనీ, అది కావాలనీ, ఇది కావాలనీ—వాడికి అవస్థ . . .'' అన్నాడు కరుణాకరరావు.

ఆమె ''సరే'' అనలేదు.

తన మాటలు ఆమెకు అంగీకార యోగ్యంగా లేవని ఆయన గ్రహించి ఊరుకున్నాడు.

ఆమెలో రేగిన తుఫాను ప్రభావం, బయటికి ఏమీ కనిపించక పోయినా, ఆ గృహ వాతావరణం మీద దెబ్బ కొట్టక పోలేదు.

ప్రయాణానికి అన్ని ఏర్పాట్లూ జరిగాయి. పద్మావతి స్టేషన్‌కు బయలుదేరింది. వెంట శ్యాము, సూర్యం, ఆమెను రైలు ఎక్కించడానికి వెళ్లారు.

• • •

ఆదివారం మధ్యాహ్నం. ఆసుపత్రి లేదు. మోహన్ పడక కుర్చీలో కూచుని పేపరు చూస్తున్నాడు. ఎవ్వరూ లేరు. నిశ్శబ్దంగా వుంది.

పద్మావతి మోహన్‌కు దగ్గరగా వున్న కుర్చీలో కూచుని గొంతు సవరించుకొని అంది—

''నాయనా మోహన్! ఒక్కమాట అడగాలని చాలా రోజులుగా ప్రయత్నిస్తున్నాను. అసలు రావటం కూడ ఆవుద్దేశ్యంతోనే వచ్చాను . . అడగనా ?''

''అడుగూ'' అన్నాడు మోహన్.

''నన్ను చాలారోజులుగా నీవు ''అమ్మా'' అని పిలవటంలేదు. కారణం ఏమిటి తండ్రీ!'' ఆమె కళ్లనిండా నీళ్లు తిరిగాయి. గొంతు దుఃఖంలో పూడుక పోయింది.

మోహన్ ఏమీ పలకలేదు.

''నీవు 'అమ్మా' అని పిలవకపోతే నేను బ్రతకలేను బాబూ''

మోహన్ కళ్లు పెద్దవిచేసి తల్లి వేపుచూశాడు. కందగడ్డలా వున్న ముఖాన్ని చిట్లించి లేచి బయటికి వెళ్లాడు.

జీవి వూహకు మహాప్రళయం ఎంత భయంకరంగా తోస్తుందో అంత భయంకరంగానూ ఆక్షణం ఆమె అనుభవంలోకి వచ్చింది. చప్పున చీకటయింది. కటిక చీకటి!

కళ్లు మూతలు వేసుకొని మంచంమీద పడుకోవాలనుకొని కుర్చీలోంచి లేచింది. కాళ్లు తడబడి కింద పడిపోయింది. నెమ్మదిగా లేచి తడుముకొంటూ మంచం దగ్గరకు చేరింది. కోడు పట్టుకొని ఎలాగోలేచి మంచంమీద పడిపోయింది. దిండూ పరుపూ కన్నీళ్లతో తడిసిపోయాయి. ఒళ్లుతెలియు స్థితిలో పడిపోయింది.

— మిగతా 48వ పేజీ

మోహన్ రాత్రి తొమ్మిది గంటలయ్యాక యింటికి చేరాడు. ఎక్కడెక్కడో తిరిగివచ్చాడు. ఆలా కొండవేపు వెళ్ళాడు. కొండమీదికి చాలా ఎత్తు వరకూ ఎక్కి పెద్ద బండమీద కూర్చొని చీకటులు అలము కోవటం చూస్తూ వుండి పోయాడు. అతనికి ఆలోచనలేమీ రావటంలేదు. హృదయం చాల కఠినంగా, మొరటుగా వుంది. తల్లిని గూర్చి ఏమీ ఆలోచించ తలచలేదు. ఈ పరిస్థితి పరిణామం ఎలా వుంటుందో అన్న ఆసక్తి అతనికేమీ లేదు. 'నిండా మునిగిన వానికి చలి ఏమిటి ?' అనట్లుంది అతని మనస్థితి. "చాలా పొద్దు పోయింది కనుక యింటికి పోవాలి" అనుకుని బయలుదేరాడు. దారిలో బ్రిడ్జిమీద కొంతసేపు — కింద పారుతూన్న వల్లటి ప్రవాహాన్ని చూస్తూ — నిల్చున్నాడు. ఇంకా పొద్దు పోతే బాగుండదనుకొని గబగబా నడిచి యిల్లు చేరాడు.

తల్లి మంచంమీద చీకటిలో పండుకొని వుండటం చూశాడు. తనను భోజనానికి తొందర పెట్టలేదు — కారణం ? యివాళిటి సంఘటనే అయి వుంటుంది అనుకున్నాడు. లైటువేసి, పక్కసరిచేసికొంటూ తల్లివేపు చూశాడు తల్లి నిద్రపోతున్నట్లు లేదు. తెలివి తప్పి పడివున్నట్లనిపించింది. దగ్గరకు వెళ్లి తాకి చూశాడు. వొళ్లు మసలిపోతోంది. ముఖంమీద చెయ్యివేసి చూశాడు. కణతలు వేగంగా కొట్టుకొట్టుకున్నాయి. పూర్వమునబట్టే "నాయనా, మోహన్! నువ్వేనా ? భోజనం చేశావా ?" అని కళ్లు మూసుకొనే అంది.

"చేస్తానులే"

"చేస్తానులే కాదు, బాబు! చెయ్యి. నేనూ వచ్చి కూర్చోనా ?" తెరిపిళ్ళు పడని కళ్లను బలవంతంగా సగం తెరిచి చూస్తూ అంది.

"నువ్వు లేవవద్దు. నేను భోంచేస్తానుగా"

"అంతే. ముందు భోంచెయ్యి"

మోహన్ భోంచేసి వచ్చి, తల్లికి ఏదో మిక్శ్చర్ యిచ్చి వెళ్లి పడుకున్నాడు. నిద్రపట్టలేదు. తల్లి శరీరం బలమైంది కాకపోయినా చాలా ఆరోగ్య వంతమైన తత్వం. నియమబద్ధమూ, పరిశుద్ధమూ, అయిన జీవిత విధానం ఆమెది. ఆమె జబ్బుపడగా ఎప్పుడూ చూడలేదు. వహనంలో నిశ్శబ్దంగా జీవించటం ఆమె అలవాటు. తన జీవితంలోని ఒడుదుడుకులను ఆమె ఎవరితోనైనా చెప్పుకోగా అతను ఎప్పుడూ వినలేదు. ఆమె కోపంగాని, దుఃఖంగాని ఉద్రేకస్థాయికి వెళ్లగా అతనెప్పుడూ చూడలేదు.

ఆమెలో అంతరంగికంగా ఒక విచారరేఖ వున్నట్లు ఆమెను చూచిన ఎవరికైనా తెలుస్తుంది.

అయినా ఆరోగ్యశాస్త్రరీత్యా ఆమెలో సంపూర్ణ జీవశక్తివుంది. ఇంత జ్వరం రావటానికి, యీ జ్వరానికే ఆమె తట్టుకోలేక పోవటానికి యీ సంఘటనే కారణమా అన్న సందేహాన్ని అతను తల ఎత్తనివ్వలేదు.

(24 వ పేజీ తరువాయి)

మోహన్ తల్లిని పరీక్షించాడు. ఉదయానికే —ఒక పన్నెండు గంటల జ్వరానికే — ఆమె విపరీతంగా నీరసపడి పోయింది. జ్వరం వారం రోజులపాటు బాధించినా రాకూడనంత నీరసం ఆమెలో కనిపించింది.

బత్తాయిరసం, హార్లిక్స్, యిన్జక్షనూ యిస్తున్నాడు మోహన్. కొడుకు ఏదిచ్చినా అభ్యంతరం పెట్టకుండా తీసుకొంటోంది.

బ్లడ్ రిపోర్టు తెప్పించాడు. రక్తంలో ఏదో సమూ కనిపించలేదు. రోగనిర్ణయం ఎలా చేయటం ? ఏమందని యివ్వటం ? అయినా జ్వరం, నీరసం తగ్గటానికి, మానసిక అవిశ్రాంతిని తగ్గించటానికి పనికివచ్చే మందులూ యిన్జక్షన్లూ ఎన్నో యిస్తున్నాడు.

రెండు — మూడు — నాలుగు — అయిదు రోజులు గడిచాయి. తరువాత ప్రతి రోజూ గడ్డుగా గడుస్తోంది.

మోహన్‌కు ఏమీతోచలేదు. మధుకు రమ్మని టెలిగ్రాం యిచ్చాడు. కరుణాకరరావుగారికోసం కబురు పంపాడు.

మధు హడావుడిగా వచ్చేశాడు. రాగానే బ్లడ్ రిపోర్టు చూసి, మోహన్ ఏవి మందులు వాడాడో అడిగి తెలుసుకొని — "నిమోనియం! ఏమి ట్రీట్‌మెంట్‌రా యిది! ఏ జబ్బు కనిపించిందని యిన్ని డ్రగ్స్ వాడావు?" అని దగ్గరకు వెళ్లి పద్మావతిని చూసి ఆశ్చర్యంతో — "మోహన్! తపోమూర్తి లాంటి తల్లి! చాలా అదృష్టవంతుడివి" అన్నాడు

పద్మావతి ముఖం మీదికి వంగి. "అమ్మా, యిలా చూడండి!" అని ఆమె ఏకాంతం చెదరి పోయేలా కొంచెం బిగ్గరగా పిలిచాడు.

ఆమె మోహన్ పిలిచాడనుకొంది! ఆశగా రెప్పలెత్తి చూసింది. వింతకాంతి ఆమె కళ్లలో మెరిసింది. దుర్బల శరీరం పులకించినట్లయింది. కాని, ఆ పిలిచింది మోహన్ కాదని తెలుసుకున్నప్పుడు ఆమెరెప్పలు వాలాయి. ఆమె పొందిన ఆశాభంగానికి తట్టుకోలేక శరీరమంతా చెమటలు పోశాయి.

మధు మళ్లీ "అమ్మా, యిలా చూడండి నేను మోహన్ స్నేహితుణ్ణి. మిమ్మల్ని బ్రతికించి మోహన్‌కు ఒప్పగించిగాని యిక్కడి నుంచి కదలను" అంటూ నొప్పి కలగకుండా యిన్జక్షన్ యిచ్చాడు.

పద్మావతి మధువేపు ఆశ్చర్యంతో చూసింది. మోహన్ చలన రహితంగా శిలలా నిల్చొని వున్నాడు బయట మోటారు ఆగిన చప్పుడయింది.

కరుణాకరరావు, వెంట శ్యాము, సూర్యం వచ్చారు.

లోపలికి అడుగు పెడుతూనే ఆదుర్దాగా కరుణాకరరావు "అమ్మకు ఎలావుంది మోహన్?" అని అడుగుతూ మంచం వద్దకు వెళ్లాడు.

మోహన్ ఏమీ పలకలేదు.

శ్యాము, సూర్యం పద్మావతి పక్కమీద కూర్చున్నారు.

వాళ్లను చూడగానే పద్మావతికి దుఃఖం ముంచుకొచ్చింది. విపరీతంగా ఏడ్చింది. శ్యాము, సూర్యం కళ్లలో నీళ్లు తిరిగాయి. కరుణాకరరావు చలించి పోయాడు.

మధు "అమ్మా, మీరు ఏమాత్రం గాసి పడకూడదు" అన్నాడు.

కాని, పద్మావతి ఆమాటలను వినగలస్థితిలో లేదు. దుఃఖం కట్టలు తెంచుకొంది. జ్వరం క్షీణించింది. శరీరమంతా దిగచెమటలు పోశాయి. ఒంటి గుడ్డలు, పక్కబట్టలు చెమటతో తడిసి ముద్ద అయ్యాయి.

ఆమెకు చలువలు కమ్ముకొచ్చాయి. ఇదా రావటంకోసం మధు మందును సిరెంజిలోకి ఎక్కిస్తున్నాడు. వణుకుతున్న చేతులతో బాహ్య పచారాలు చేస్తోంది. అంతా భయంకరంగా వుంది.

కరుణాకరరావు ఆమెలోనుంచి లేచిపోతున్న ఆత్మకు నివేదిస్తున్నట్లు దీనమూ, విశ్వాసపూర్ణమూ అయిన కంఠంలో ఆత్మశక్తి వెలిబిరిసేలా యిలా అన్నాడు —

"అమ్మా, పద్మా! ఇటు చూడు — నీ మోహన్. కళ్యాణి నిర్దాక్షిణ్యంతో వదలిపెట్టిపోయిన శ్యామూనూ, సూర్యాన్నీ చూడు ఈ ముగ్గురికే కాదు నీవు తల్లివి, నిస్వార్థంగా జీవితమంతా యోగినిలా బ్రతక గలిగిన నీవు నాకు కూడ తల్లివే.

"అమ్మా, మా ప్రార్థన వినవూ! మాకోసం యింకా కొంతకాలం మామధ్య వుండవూ!"

అర్ధనిమీలిత నేత్రుడైన కరుణాకరరావు ప్రార్థన నుండి లేచినట్లు కళ్లు తెరిచాడు.

మోహన్ హృదయంలోని మాలిన్యం యీ ప్రార్థన నుండి వినవచ్చిన "మాతృ" శబ్దంతో ప్రక్షాళితమై పోయింది. కన్నీరు బొటబొట దొర్లసాగాయి. తీవ్రంగా చలించి పోయాడు! వెళ్లి తల్లి పక్కమీదికి వాలి,

"అమ్మా! నేను పిలుస్తున్నాను— నీ మోహన్ను! — అమ్మా! అమ్మా!! అమ్మా!!!' అని పెద్దగా గొంతు బ్రద్దలయ్యేలా ఏడుస్తూ అతి దీనంగా పిలవసాగాడు.

శరీరాన్ని విడిచి ఎగిరి పోతున్న పద్మావతి ఆత్మ ఆ పిలుపుకు మరులుగొని మరలి యధాస్థానాన్ని చేరుకుంది.

"అమ్మ" కనురెప్పలు విప్పి చూసింది.

ప్రేమపూర్ణమైన ఆమె విశాల నేత్రాలలోని ఆవరణం అంతటా ఆవరించి రాగమయం చేసింది

★

